క్లుప్తంగా

అధికారులకు శిక్షణ

హుస్నాబాద్: ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోలింగ్ అధికారులకు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతులను రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ బెన్ షాలోమ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలపై అవగాహన ఉండే విధంగా 208 మంది అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల నియమావళి పాటించాలని కోరారు.

'విశ్వరూప సభను విజయవంతం చేయండి'

హుస్నాబాద్: ఏబీసీడీ వర్గీకరణ కోసం ఈనెల 18న హైదరాబాద్‌లో తలపెట్టిన విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జేపీ లత పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదిగలు, మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం చేకూరాలంటే వర్గీకరణ మాత్రమే ఏకైక సాధనమన్నారు. సమావేశంలో ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జి యాదగిరి, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి సామ్రాట్ ప్రకాష్, నాయకులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లికి చెందిన పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు బుధవారం జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్, సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ బాలరాజు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య, కుమార్, రెహమాన్, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సయపల్లికి చెందిన ఉపసర్పంచ్ చింతల ఎల్లయ్యతో పాటు ఐదుగురు వార్డు సభ్యులు బుధవారం జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు అంబటి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు దామోదర్, బాబు, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఉపాధి

చిన్నకోడూరు(సిద్దిపేట): కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏపీఎం మహిపాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాచాపూర్‌లో కుట్టు శిక్షణ శిబిరం ముగింపు సమావేశానికి హాజరై మాట్లాడారు. మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాజుల బాబు, సీసీ శ్రీనివాస్‌రెడ్డి, మహిళా సమాఖ్య సభ్యులు, కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఏపీఎం, సీసీని ఘనంగా సన్మానించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

మద్దూరు(హుస్నాబాద్): పాముకాటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మర్మాములలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెట్కూరి చంద్రయ్య (55) రోజు మాదిరిగానే ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పొలంలో తిరుగుతుండగా పాము కాటు వేసింది. చంద్రయ్య అరుపులు గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

'ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించండి'

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని గ్రామస్తులు డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్లపై ధాన్యం కుప్పలు పేరుకుపోకుండా కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, ఎంపీటీసీ ఆరుట్ల లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

● అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్

దుబ్బాక: ఎన్నికల నేపథ్యంలో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఎన్నికల అధికారులకు సూచించారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో రెండో రోజు కొనసాగుతున్న శిక్షణ తరగతులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియ వందశాతం సజావుగా సాగాలంటే ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం దుబ్బాక రాజకీయ ప్రతినిధులతో సమావేశమయ్యారు. నామినేషన్ పత్రాలు దుబ్బాక ఆర్ఓ కార్యాలయంలో లభిస్తాయని తెలిపారు. నామినేషన్‌కు పూర్తి దస్తావేజులతో ఒక సెట్ ఇస్తూ పూర్తి వివరాలు అందులో పొందుపరచాలని సూచించారు. నామినేషన్ వేసే రోజు రిటర్నింగ్ అధికారి చాంబర్‌లోకి కేవలం ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఎవరెవరికి ఇచ్చారో రాజకీయ ప్రతినిధులకు వివరించామన్నారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్, తదితర ఎన్నికల అధికారులతో ఎన్నికల సంఘం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు వెంకట్‌రెడ్డి, సుజాత, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



పెద్దకోడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట)/కొమురవెల్లి/నంగునూరు: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గోనెపల్లి, పెద్దకోడూరు, మైలారం, అల్లీపూర్, రామంచ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. అలాగే కొమురవెల్లి మండలంలోని గౌరయపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. నంగునూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకేపీ, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయ అధికారి గీత, ఏపీఎం ఆంజనేయులు అన్నారు. బుధవారం గటమల్యాల, పాలమాకుల, ముండ్రాయి, అంక్షాపూర్, ఖాతలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

కేంద్రాల్లోనే విక్రయించాలి

సిద్దిపేటరూరల్: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఏపీఎం విజయనిర్మల అన్నారు. బుధవారం రూరల్ మండల పరిధిలోని ఇర్కోడు, బుస్సాపూర్, చింతమడక, మాచాపూర్, తోర్నాల, సీతారాంపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మద్దూరు: కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

మద్దూరు(హుస్నాబాద్)/జగదేవ్‌పూర్(గజ్వేల్): ఈనెల 30వ తేదీన జరిగే సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి కోరారు. బుధవారం దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి, బెక్కల్ గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు షేక్ యూనుస్ అహ్మద్ అలీ, భాస్కర్‌రెడ్డి పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్, తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో గజ్వేల్‌రూరల్ సీఐ జానకిరాంరెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాల అధికారులు, సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

దుబ్బాకటౌన్: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని గంభీర్‌పూర్, పోతారం, చీకోడ్ గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

జోరుగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



దుబ్బాకలో..



కొక్కొండలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

దుబ్బాకరూరల్/దుబ్బాక/మర్కూక్(గజ్వేల్)/ములుగు: బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతోంది. దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని గోసాన్‌పల్లి, రఘోత్తంపల్లి గ్రామాల్లో ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మి, ఎంపీటీసీ లక్ష్మీనారాగౌడ్, మాధవి, రాంరెడ్డి, కిషన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాక మున్సిపల్ పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సులోచన, రాజవ్వ, బీఆర్ఎస్ మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మర్కూక్ మండలంలోని గణేష్‌పల్లిలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం యాదవ్, ఎంపీపీ ఉప అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణ యాదవ్ మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. ములుగు మండలం కొక్కొండ, సింగన్నగూడ గ్రామాల్లో కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ జయమ్మ, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్: ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్డీఓ, ఆర్ఓ బెన్ షాలోమ్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పచ్చని తెలంగాణలో చిచ్చుపెట్టిన కాంగ్రెస్ రాజకీయాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఎండీ అయూబ్, ఇంద్రాల సారయ్య, బండి పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని జిల్లెలగడ్డ గ్రామానికి చెందిన గుగులోతు రాజేందర్(30) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆరు నెలల కిందట రాజేందర్ భార్య అగ్ని ప్రమాదంలో మరణించింది. మనోవేదనతో రాజేందర్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకోవడంతో కుటుంబ సభ్యులు గమనించి కిందకు దింపారు. అప్పటికే మరణించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ప్రతిపక్షాలకు ఓటమి తప్పదు'

గజ్వేల్‌రూరల్: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటమి తప్పదని బీఆర్ఎస్ లీగల్‌సెల్ నాయకులు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తూ దేశంలోనే ఇతర రాష్ట్రాలకు తెలంగాణను ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ వివిధ మండలాల బాధ్యులు దాసరి నరేష్, మామిళ్ల కృష్ణ, కొంటమైన నర్సింలు, జోగిని రవి, శ్రీరాం నర్సింలు, పిట్ల సత్యనారాయణ, జీర రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు గుర్తింపేది?

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని గిరిజన నాయకులు అసమ్మతి గళం వినిపిస్తున్నారు. ఉమ్మడి కొండాపూర్ గిరిజన నాయకులు, కార్యకర్తలు బుధవారం రహస్యంగా సమావేశమయ్యారు. కాంగ్రెస్ అధిష్టానం జనగామ టికెట్ కొమ్మూరికి కేటాయించడం సంతోషకరమైనా సదరు అభ్యర్థి గిరిజనులను పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కొండాపూర్‌లో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ మూడు వేలపై చిలుకు ఉందన్నారు. రెండు, మూడు రోజులు వేసి చూస్తామని.. ఆతర్వాత గిరిజనులకు సరైన గుర్తింపు ఇవ్వకపోతే భవిష్యత్ కార్యాచరణ చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జాటోత్ పూల్‌సింగ్, బాదావత్ శ్రీనివాస్, బానోత్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'పింక్ కలర్ డే'



పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థుల కోలాహలం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పింక్ కలర్ విజయానికి చిహ్నం అని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని పలు పాఠశాలల్లో పింక్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పింక్ కలర్ దుస్తులు, ఆట వస్తువులు, తిను బండారాలు, పండ్లు, టోపీలు, బెలూన్లతో సందడి చేశారు. ప్రకృతిలో ప్రతి రంగు విశిష్టతను విద్యార్థులకు తెలియచేసే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు.

'రసమయి'సమక్షంలో చేరికలు



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బుధవారం కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఎలుక దేవయ్య, గుండారం ఉపసర్పంచ్ రాము, సంతోష్, అమరేందర్‌రెడ్డి, కత్తి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు



చిన్నకోడూరు: వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చిన్నకోడూరు(సిద్దిపేట)/ చేర్యాల: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండల పరిధిలోని మెట్టుబండల వద్ద చిన్నకోడూరు పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా తరలిస్తున్న డబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ సుభాష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలన్నారు. అలాగే చేర్యాలలో ఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. టెక్నాలజీని మంచికి మాత్రమే వినియోగించాలని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపే మెసేజ్‌లకు బదులు ఇవ్వొద్దన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చాలా మంది ఉద్యోగులు, యువకులు, విద్యార్థినులు, మహిళలు చిక్కుకొని మోసపోతున్నారని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే హెల్ప్‌లైన్ 1930కి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, షీటీం అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



బోనాలతో మహిళలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని బీజీవెంకటాపూర్‌లో బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లికి బోనాలు పండుగ వైభవంగా చేపట్టారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో సందడి నెలకొంది. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, సంఘం సభ్యులు బాబు, వెంకట్, పరమేశ్వర్, రాజు, కరుణకర్, కనకయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు నాచగిరి హుండీ లెక్కింపు**

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో గురువారం హుండీ సొమ్ము లెక్కింపు ఉంటుందని ఆలయ సహాయ కమిషనర్ అన్నపూర్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు.

◆ **విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ**

దుబ్బాక: పట్టణంలోని భవిత సెంటర్‌లో గల విద్యార్థులకు ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న చంద్రశేఖర్ బుధవారం దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి**

హుస్నాబాద్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలంటే బీజేపీ, బీఆర్ఎస్‌లకు వ్యతిరేకంగా ఓటు వేయాలని సీపీఐ నాయకుడు గడిపె మల్లేశ్ అన్నారు. బుధవారం మడద, రాములపల్లి, మహ్మదాపూర్, నాగారం గ్రామాల్లో సీపీఐ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లారెడ్డి, సంజీవరెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

◆ **ధర్మసమాజ్ పార్టీతోనే విద్య, వైద్యం**

కోహెడ(హుస్నాబాద్): అణగారిన వర్గాలకు విద్య, వైద్యం, ఉపాధి అందాలంటే ధర్మసమాజ్ పార్టీతోనే సాధ్యమని హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి బోయిని సదన్ మహరాజ్ అన్నారు.

◆ **రోడ్డు విస్తరణ పనుల అడ్డగింత**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను బుధవారం స్థానికులు అడ్డుకున్నారు. రోడ్డు విస్తరణ పనులు డివైడర్‌కు ఇరువైపులా ఒకేలాగా చేయడం లేదని.. దీని వల్ల తాము నష్టపోతున్నామని ఆరోపించారు.

◆ **పెయింటర్స్‌ను కార్మికులుగా గుర్తించాలి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): పెయింటర్స్‌ను కార్మికులుగా గుర్తించాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం జగదేవ్‌పూర్‌లో పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కనకయ్య, సభ్యులు మురళి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

◆ **హరీశన్నకే మా ఓటు**



నంగునూరు(సిద్దిపేట): నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచి ఎమ్మెల్యేగా హరీశ్‌రావుకే ఓటేస్తామని అక్కేనపల్లి, కోనాయిపల్లి గ్రామస్తులు బుధవారం తీర్మానం చేశారు. ఈసందర్భంగా గ్రామ కులసంఘాల అధ్యక్షులు సర్పంచ్, ఎంపీటీసీ ఆధ్వర్యంలో తీర్మాన కాపీని మండల పార్టీ అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమ, శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి, కృష్టారెడ్డి, సర్పంచ్ వెంకటేశం, ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **నూతన నియామకం**

బెజ్జంకి(సిద్దిపేట): బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడిగా మండలంలోని దాచారం ఎంపీటీసీ కొలిపాక రాజును నియమించినట్లు ఆపార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **ఈటలను భారీ మెజార్టీతో గెలిపిద్దాం**

గజ్వేల్‌రూరల్: బీజేపీ గజ్వేల్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ములుగు ఇన్‌చార్జి వెంకటరమణ, గజ్వేల్ మండల ఇన్‌చార్జి ఎల్లు రాంరెడ్డి, అసెంబ్లీ విస్తారక్ అనుష్‌యాదవ్, నాయకులు గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **కేసీఆర్‌ను గెలిపించుకుందాం**

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపించుకుందామని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌లు వేర్వేరుగా నిర్వహించిన ప్రచారాల్లో పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 9, 11, 20 వార్డుల్లో మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని కొడకండ్లలో ఎంపీపీ దాసరి అమరావతితో కలిసి ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990